క్లుప్తంగా

రేషన్ కష్టాలపై స్పందించిన అధికారులు

సాక్షి స్పందన

పోలవరం రూరల్: పోలవరం మండలం జీళ్లగూడెం పంచాయతీలోని జీసీసీ డిపో ద్వారా లబ్ధిదారులకు సకాలంలో రేషన్ సరుకులు అందిస్తారని పోలవరం తహసీల్దార్ ఆర్ సాయిరాజు తెలిపారు. శనివారం సాక్షిలో రేషన్ కష్టాలు పునరావృతం అనే శీర్షికన వచ్చిన కథనంపై తహసీల్దార్ స్పందించారు. జీళ్లగూడెం జీసీసీ డిపో పరిధిలో ఉన్న 456 రేషన్ కార్డుల్లో 324 కార్డుల లబ్ధిదారులకు రేషన్ పంపిణీ చేశామన్నారు. 65 సంవత్సరాలు పైబడిన లబ్ధిదారుల ఇళ్లకు రేషన్ డీలర్ స్వయంగా వెళ్లి రేషన్ అందించినట్టు చెప్పారు. జీసీసీ డిపో పరిధిలోని లబ్ధిదారులకు ఇబ్బందుల్లేవని, డిపో సమారు 1 కిలోమీటరు దూరం ఉందని జీళ్లగూడెం గ్రామ రెవెన్యూ అధికారి నివేదిక ఇచ్చినట్టు తహసీల్దార్ తెలిపారు.

ఎన్ఎంఎంఎస్‌కు చింతలపూడి విద్యార్థులు


తమలం అభిషిక్


కుమ్మరి చరణ్


దేవిని తేజశ్రీ


బాదంపూడి శిరీష

చింతలపూడి: స్థానిక జెడ్పీహెచ్ స్కూల్ (సుబ్బరాజు స్కూల్) విద్యార్థులు నలుగురు జాతీయ ఉపకార వేతనానికి (ఎన్ఎంఎంఎస్ స్కాలర్‌షిప్) ఎంపికయ్యారని పీడీ ఎం సీమోను శనివారం తెలిపారు. ఎంపికైన తమ విద్యార్థులు తమలం అభిషిక్, కుమ్మరి చరణ్, దేవిని తేజశ్రీ, బాదంపూడి శిరీషలకు ఏటా రూ.12,000 చొప్పున నాలుగేళ్ల పాటు వస్తుందని పేర్కొన్నారు. విద్యార్థులకు స్కూల్ యాజమాన్యం, స్థానికులు అభినందనలు తెలిపారు

విద్యార్థులకు బహుమతులు


విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న దృశ్యం

లింగపాలెం: మండలంలోని ధర్మాజీగూడెం శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన తరగతులు శనివారం ముగిశాయి. గ్రంథాలయాధికారి సీహెచ్‌వీ రమణ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో వివిధ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు, ప్రశంసాపత్రాలను అందజేశారు. గ్రంథాలయ కమిటీ సభ్యులు బోనగిరి ప్రకాశరావు, 20 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

50 ఏళ్లు నిండిన వారికి పింఛన్ ఇవ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఫ్రాన్సిస్

జంగారెడ్డిగూడెం: సూపర్ సిక్స్ హామీలో భాగంగా 50 సంవత్సరాల వయసు పైబడిన ఎస్సీ, బీసీలకు పింఛన్ ఇవ్వాలని కుల వివక్షత వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్) జిల్లా కార్యదర్శి ఎ.ఫ్రాన్సిస్ డిమాండ్ చేశారు. స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో శనివారం కె.సుబ్బారావు అధ్యక్షతన నిర్వహించిన కేవీపీఎస్ జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. సూపర్ సిక్స్ హామీల అమలులో కూటమి ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. సమావేశంలో ఎ.ధర్మరాజు, శంకరం తదితరులు పాల్గొన్నారు.

హైస్కూల్లో యోగాసనాలు


యోగాసనాలు వేస్తున్న క్లబ్ సభ్యులు, అధికారులు

కొయ్యలగూడెం: మానసిక రుగ్మతులకు, శారీరక బాధలకు యోగా దివ్య ఔషధం వంటిదని ఎంపీడీఓ కె.కిరణ్‌కుమార్ పేర్కొన్నారు. శనివారం బాలుర హైస్కూల్ క్రీడా ప్రాంగణంలో కొయ్యలగూడెం వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో యోగాసనాల కార్యక్రమం నిర్వహించారు. వాకర్స్ క్లబ్ గవర్నర్ రామరాజు పర్యవేక్షణలో క్లబ్ సభ్యులు యోగాసనాలు వేశారు. జూన్ 21న హై స్కూల్ ప్రాంగణంలో ఐదు వేల మందిచే అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ తెలిపారు. కార్యక్రమానికి విద్యార్థులతో పాటు ఉద్యోగులు పాల్గొంటున్నట్టు పేర్కొన్నారు.

విలువలకు, త్యాగానికి ప్రతీక బక్రీద్

భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు

చింతలపూడి : పట్టణంలో శనివారం ముస్లింలు బక్రీద్ పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. స్థానిక ఈద్గాహ్‌లో ముస్లింల చేత ఇమామ్ షేక్ అబ్దుల్ వదూద్ బక్రీద్ ప్రత్యేత ప్రార్థనలు చేయించారు. బక్రీద్ పండుగ విశిష్టతను వివరించారు. విలువలకు, త్యాగానికి బక్రీద్ పండుగ ప్రతీక అని ఇమామ్ అన్నారు. అనంతరం ఖబర్‌స్థాన్‌కు చేరుకుని దివంగత కుటుంబ సభ్యుల ఆత్మశాంతికి ప్రార్థనలు చేశారు. చింతలపూడితో పాటు రాఘవాపురం, ప్రగడవరం, యర్రగుంటపల్లి, సీతానగరం గ్రామాల్లో కూడా బక్రీద్‌ను ఘనంగా నిర్వహించుకున్నారు.

లింగపాలెం మండలంలో..

లింగపాలెం: లింగపాలెం మండలంలో ముస్లింలు బక్రీద్ వేడుకను ఘనంగా నిర్వహించారు. మసీదులకు వెళ్లి ప్రత్యేక నమాజు చేసి, ఒకరినొకరు ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ధర్మాజీగూడెం వెంకటేశ్వర కల్యాణమండపంలో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పేషిమామ్, గౌరవాధ్యక్షుడు ఎండీ అక్బర్ ఆలీ, ముతవల్లి, సయ్యద్ గౌస్, సయ్యద్ బాజీ, సుబాని, అహ్మద్‌ఖాన్, మస్తాన్, సాధిక్, షరీఫ్, బాషి, వలీ, చోటా, నాగులు, ముస్లింలు పాల్గొన్నారు.


కొయ్యలగూడెం : బయ్యన్నగూడెం ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు


బుట్టాయగూడెం : ఈద్గా వద్ద ప్రార్థన చేస్తున్న ముస్లింలు

భక్తి ప్రభక్తులతో బక్రీదు

కొయ్యలగూడెం: బక్రీదు పర్వదినాన్ని ముస్లింలు శనివారం ఘనంగా నిర్వహించారు. కొయ్యలగూడెం పెద్ద మసీదు వద్ద పేదలకు దాన ధర్మాలు నిర్వహించారు. మదరసా వద్ద ముస్లిం మహిళలు సామూహిక ప్రార్థనలు చేశారు. బయ్యనగూడెంలో బక్రీద్ నమాజ్‌ను ఈద్గా వద్ద భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. జామియా మస్జిద్ కమిటీ అధ్యక్షుడు పఠాన్ మహబూబ్ జానీ, షేక్ షియాత్, షేక్ సయ్యద్ బాజీ, సయ్యద్ రసూల్, ఎస్ఎం అలీ, సయ్యద్ అహ్మద్, షేక్ లతీఫ్ పాల్గొన్నారు. దిప్పకాయలపాడు, కన్నాపురం, బయ్యనగూడెం, వేదాంతపురం, యర్రంపేట, రాజవరం, గ్రామాల్లో బక్రీద్ ప్రార్థనలు చేశారు.

త్యాగాలకు ప్రతీక బక్రీద్

జంగారెడ్డిగూడెం: లక్కవరం ఫారూఖీ మసీదులో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కమిటీ అధ్యక్షులు పఠాన్ అన్వర్ బాషా అధ్యక్షతన మసీదు గురువు బాబర్ అలీ బక్రీద్ గురించి వివరించారు. బక్రీద్ పండుగ త్యాగాలకు ప్రతీక అని, వేల సంవత్సరాల క్రితం దైవ ప్రవక్త ఇబ్రహీం చేసిన త్యాగాలను గుర్తుచేశారు. ఇస్లాం క్యాలెండర్ ప్రకారం జిల్ హజ్ 12వ నెల 10న బక్రీద్ నిర్వహించుకుంటారన్నారు. అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకొని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. కార్యక్రమంలో కమిటీ గౌరవ అధ్యక్షుడు షేక్ హుస్సేన్, ఉపాధ్యక్షులు పకీర్ షా, ప్రధాన కార్యదర్శి ఇమామ్, కార్యదర్శి ఎండీ లాల్సా, కోశాధికారి నాసిర్, సభ్యులు షాజహాన్, బాజీ, బషీర్, కరీముల్లా, ఇతిషావలి, మహబూబ్ జానీ, పఠాన్ నన్న, బడేసా తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బక్రీద్ వేడుకలు

ద్వారకాతిరుమల: మండలంలోని పలు గ్రామాల్లో బక్రీద్ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. మసీదులు ముస్లింలతో కళకళలాడాయి. దేవినేనివారిగూడెం, ద్వారకాతిరుమల, తిరుమలంపాలెం, పంగిడిగూడెం, దొరసానిపాడు, ఐఎస్ రామానుజాపురం తదితర గ్రామాల్లోని ముస్లింలు ఉదయాన్నే మసీదులకు చేరుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మత గురువులు బక్రీద్ ప్రాముఖ్యతను వివరించారు.

ఘనంగా బక్రీద్ పండుగ

పోలవరం రూరల్: పోలవరం అహల్ సున్నత్ జమాత్ మసీద్ కమిటీ ఆధ్వర్యంలో ముస్లింలు బక్రీద్‌ను ఘనంగా నిర్వహించారు. మెయిన్ సెంటర్‌లో ఉన్న ఈద్గా వద్ద తెల్లవారుజాము నుంచే ప్రత్యేక ప్రార్థనలు చేపట్టారు. మసీదు ప్రెసిడెంట్ యాసిన్ షరీఫ్, సందాని, సలీం, బాషా, పటాన్ ఖాజా తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో బక్రీద్

బుట్టాయగూడెం: మండలంలో బక్రీద్ పర్వదినాన్ని ముస్లింలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. బుట్టాయగూడెం, దొరమామిడి, రామన్నగూడెం, రెడ్డిగణపవరం, పులిరామన్నగూడెం గ్రామాల్లోని ఈద్గాల వద్ద ముస్లింలు సామూహిక ప్రార్థనలు చేశారు. ముస్లింలు పెద్దఎత్తున తరలివచ్చి ప్రార్థనల్లో పాల్గొన్నారు.


పోలవరం రూరల్ : పోలవరంలో నమాజు చేస్తున్న ముస్లింలు


చింతలపూడి : ఈద్గాహ్‌లో బక్రీద్ విశిష్టతను వివరిస్తున్న ఇమామ్


జంగారెడ్డిగూడెం : బక్రీద్ సందర్భంగా నమాజు చేస్తున్న ముస్లింలు


ద్వారకాతిరుమల : దేవినేనివారిగూడెం మసీదులో ప్రసంగిస్తున్న మత గురువు

షైనింగ్ స్టార్స్‌కు విద్యార్థినుల ఎంపిక


బేబీ నాగ సాయి పూజిత


లాహిరి దుర్గా వాణి


బి.శశివరుణ్


ఎస్‌కే హనీఫ్

ద్వారకాతిరుమల: మండలంలోని తిరుమలంపాలెం గ్రామానికి చెందిన ఇద్దరు విద్యార్థినులు షైనింగ్ స్టార్స్ అవార్డులకు ఎంపికయ్యారు. పదోతరగతి పరీక్షా ఫలితాల్లో గ్రామానికి చెందిన బేబీ నాగ సాయి పూజిత 594, లాహిరి దుర్గా వాణి 590 మార్కులు సాధించారు. వీరు కామరవపుకోట మండలం తాడిచర్లలోని ఒక ప్రైవేట్ పాఠశాలలో పదో తరగతి పూర్తి చేశారు. వీరు ఈనెల 9న ఏలూరులోని సర్ సీఆర్‌రెడ్డి కళాశాలలో జరిగే కార్యక్రమంలో ఒక్కొక్కరూ రూ.20 వేలు నగదు బహుమతితో పాటు, ప్రశంసా పత్రాలను అందుకోనున్నారు.

లింగపాలెం విద్యార్థులకు అవార్డులు

లింగపాలెం: పదో తరగతిలో ప్రతిభ చూపిన మండలంలోని ధర్మాజీగూడెం శ్రీవిద్య హైస్కూల్ విద్యార్థులు బి.శశివరుణ్, ఎస్‌కే హనీఫ్‌లు షైనింగ్ స్టార్ పురస్కారాలకు ఎంపికయినట్టు పాఠశాల డైరెక్టర్ చలసాని రత్నాకర్ తెలిపారు. విద్యార్థులను ఆయన అభినందించారు.

వ్యవసాయ పథకాలపై అవగాహన


వ్యవసాయ పద్ధతులను వివరిస్తున్న శాస్త్రవేత్త రామచంద్రుడు

కొయ్యలగూడెం: రైతులు వ్యవసాయ పథకాలపై అవగాహన కలిగి ఉండడాలని వ్యవసాయ శాస్త్రవేత్త కె.రామచంద్రుడు పేర్కొన్నారు. శనివారం పరింపూడి సమీపంలోని రైతులకు మండల వ్యవసాయ శాఖ అధికారి చెన్నకేశవులు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పెదవేగి ఏడీఏ పి.లలితసుధాతో కలిసి పాల్గొన్నారు. కిసాన్ మాన్ ధన యోజన, పీఎం ఫసల్ బీమా యోజన, నేషనల్ అండ్ హనీ మిషన్, రాష్ట్రీయ కృషి వికాస్ యోజన, డీటెయిల్స్ రిపోర్ట్ ఆధారిత పథకాలు పరంపరగత కృషి వికాస్ యోజన, పీఎం కృషి సించాయు యోజన, జాతీయ వ్యవసాయ మార్కెట్ విధానంపై అవగాహన కల్పించారు. ఉద్యాన శాఖ అధికారి ధీరజ్ లక్ష్మణ్, ఉత్తమ రైతు పురస్కారాల అవార్డు గ్రహీతలు పాల్గొన్నారు.

కూలీలకు పే స్లిప్పులు ఇవ్వాలి


సమావేశంలో మాట్లాడుతున్న ప్రభాకర్

జంగారెడ్డిగూడెం: ఉపాధి కూలీలకు పే స్లిప్పులు ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జంగారెడ్డిగూడెం మండల కార్యదర్శి అందుగుల ప్రభాకర్‌రావు అధికారులను కోరారు. స్థానిక ప్రజా సంఘాల కార్యాలయంలో సంఘం మండల అధ్యక్షురాలు యాగంటి సీత అధ్యక్షతన నిర్వహించిన సంఘం మండల కమిటీ సమావేశంలో ప్రభాకర్‌రావు, జిల్లా అధ్యక్షులు ఎం.జీవరత్నం మాట్లాడారు. ఎండల తీవ్రత దృష్టిలో ఉంచుకుని ఉపాధి కూలీల పని సమయం ఉదయం 6 నుంచి 9 గంటల వరకు నిర్ణయించాలన్నారు. కూలీల సమస్యలు పరిష్కరించాలని, వేతన బకాయిలు తక్షణమే విడుదల చేయాలని కోరారు. ఎండల తీవ్రతకు మృత్యువాతకు గురైన కూలీలకు ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని డిమాండ్ చేశారు. పాతపద్ధతిలో మంచినీరు మజ్జిగ మెడికల్ కిట్లు నీడకు టెంట్లు ప్రతి పని ప్రదేశాల్లో ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో సంఘం మండల కమిటీ సభ్యులు జె.సూర్యచంద్రం, కె.సుబ్బారావు, పిల్లి పోతురాజు, పులపాకుల వీర్రాజు, ఎం.బాలరాజు, పి.చంటి, బొక్క వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

అస్వస్థతతో పాడి గేదెలు మృతి


మృతిచెందిన పాడె గేదెను చూపిస్తున్న రైతు

పోలవరం రూరల్: పోలవరం మండలం జీళ్లగూడెం గ్రామంలో మూడు పాడిగేదెలు అస్వస్థతకు గురై మృతిచెందాయి. పాడి రైతులు తెలిపిన వివరాల ప్రకారం.. దాడి రాముడుకు చెందిన ఒక గేదె, కణితి గంగరాజుకు చెందిన రెండు గేదెలు పొలంలో మేతకు వదిలారు. మేతకు వెళ్లి వచ్చిన తరువాత అస్వస్థతకు గురయ్యాయి. సచివాలయంలోని పశుసంవర్ధకశాఖ సిబ్బంది గేదెలకు చికిత్స అందించినా మృతిచెందాయి. కణితి సుబ్బారావుకు చెందిన మరో మూడు గేదెలు కూడా మేతకు వెళ్లి వచ్చి అస్వస్థతకు గురై చికిత్స పొందుతున్నట్టు అధికారులు తెలిపారు.

నిబంధనలు పాటించాలి


వాహనచోదకులకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్సై జయబాబు

టి.నరసాపురం: వాహనచోదలకు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఎస్సై ఎం.జయబాబు సూచించారు. స్థానిక ప్రధాన సెంటర్‌లో శనివారం సిబ్బందితో కలిసి ఆయన వాహన తనిఖీలు నిర్వహించారు. లైసెన్సులు లేని, హెల్మెట్ ధరించని వాహనదారులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. వాహన నిబంధనలు పాటించడం వల్ల సురక్షిత ప్రయాణానికి ఆస్కారం ఉంటుందన్నారు. తల్లిదండ్రులు మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దని సూచించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

మార్మోగిన గోవింద నామస్మరణ


పారిజాతగిరి వెంకటేశ్వరస్వామిని దర్శించుకుంటున్న భక్తులు

జంగారెడ్డిగూడెం: గోకుల తిరుమల పారిజాత గిరి శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో శనివారం విశేష పూజలు నిర్వహించారు. భక్తులు మొక్కుబడులు తీర్చుకుని స్వామి వారిని దర్శించుకున్నారు. గోవింద నామ స్మరణతో ఆలయం మార్మోగింది. భక్తులకు సూరపవారిగూడెంకు చెందిన పరిమి మురళీకృష్ణ, జ్యోతి కుటుంబసభ్యులు, మల్లుకుంటకు చెందిన నరదలి నరసింహారావు కుటుంబ సభ్యులు అన్నప్రసాద వితరణ చేశారు. కార్యక్రమాలను ఆలయ కార్యనిర్వాహణాధికారి మానికల రాంబాబు పర్యవేక్షించారు. పూజల్లో ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు పేరిచర్ల జగపతి రాజు, రెడ్డి రంగ ప్రసాద్, వాసవి సాయి నగేష్ తదితరులు పాల్గొన్నారు.

రజత వస్త్రానికి వెండి సమర్పణ


వెండి సమర్పించిన సత్తిరాజు, పుష్పావతి కుటుంబ సభ్యులు

జంగారెడ్డిగూడెం: స్థానిక శ్రీ నూకాలమ్మవారి రజత వస్త్రానికి శనివారం దాతలు పసుమర్తి సత్తిరాజు, పుష్పావతి దంపతులు, పసుమర్తి ఏడుకొండలు, మాధవి కుటుంబ సభ్యులు ఒక కేజీ వెండి సమర్పించారని ఆలయ చైర్మన్ సత్యనారాయణ (పండు) తెలిపారు. దాత కుటుంబ సభ్యులకు అమ్మవారిని దర్శనం అనంతరం అమ్మవారి శేష వస్త్రాలు, చిత్ర పటాన్ని ఇచ్చి వేద అశీర్వాదాలతో సత్కరించామన్నారు. ఈ నెల 10న మంగళవారం సాయంత్రం 4 గంటల నుంచి ప్రారంభమయ్యే 76వ చండీ హోమంలో పాల్గొన దలచిన భక్తులు పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

ఆలయ నిర్మాణానికి భూరి విరాళాలు


సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయానికి భారీ విరాళం అందిస్తున్న వెంకటరత్నం

కొయ్యలగూడెం: స్థానిక తాడేపల్లిగూడెం రోడ్డులో శ్రీ వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి నూతన ఆలయ నిర్మాణానికి భూరి విరాళాలు శనివారం సమకూరాయి. సింహపురి గ్రూప్ ఆఫ్ హోటల్స్ ప్రొప్రైటర్ మన్నే వెంకటరత్నం రూ.1,01,116 ఆలయ కమిటీ అధ్యక్షుడు తాడికొండ మురళీకృష్ణ, పాలకవర్గ సభ్యులకు అందజేశారు. విశ్వకర్మ సంఘ అసోసియేషన్ నాయకులు జవ్వాది శ్రీనివాస్ రూ.50 వేలు అందజేశారని కోశాధికారి విశ్వనాథ శర్మ తెలిపారు. చిన్నాయిగూడెంకు చెందిన యలమాటి వెంకటరాయుడు రూ.1,01,116 అందించారన్నారు.

మద్దిలో అభిషేక సేవ


ఆంజనేయస్వామి ఉత్సవమూర్తికి అభిషేక సేవ చేస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: గుర్వాయిగూడెం మద్ది క్షేత్రంలో శనివారం సందర్భంగా స్వామి వారికి అభిషేక సేవ చేశారు. ఆలయ ముఖమండపంపై స్వామివారి ఉత్సవమూర్తికి అర్చకులు శాస్త్రోక్తంగా పంచామృత అభిషేకాలు నిర్వహించారు. భక్తుల సౌకర్యార్థం ఆలయం వద్ద మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు చేశారు. మధ్యాహ్నం వరకు దేవస్థానానికి వివిధ సేవలు, విరాళాల ద్వారా రూ.1,62,643 సమకూరినట్టు ఈఓ ఆర్‌వీ చందన తెలిపారు.

శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్ట్‌కు రూ.1.01 లక్షల విరాళం


దాత వరప్రసాద్‌కు విరాళం బాండ్ పత్రం అందిస్తున్న ఆలయ ఈఓ మూర్తి

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్ట్‌కు భీమవరానికి చెందిన ఉంగరాల గౌరీ శంకర వరప్రసాద్ శనివారం రూ.1,01,000 విరాళంగా అందజేశారు. ఆయన కుటుంబ సభ్యులతో కలిసి స్వామి, అమ్మవార్లను దర్శించుకున్న అనంతరం ఈ విరాళాన్ని ఆలయ కార్యాలయంలో జమ చేశారు. ఈ సందర్భంగా దాతకు ఆలయ ఈఓ ఎస్‌వీ సత్యనారాయణ మూర్తి విరాళం బాండ్ పత్రాన్ని అందించి, అభినందించారు.

9న యోగాంధ్ర ర్యాలీ

ఏలూరు (మెట్రో) : జిల్లాలో యోగాను ప్రజలకు మరింత చేరువ చేయాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని గౌతమీ సమావేశపు హాలులో శనివారం యోగాంధ్ర కార్యక్రమాలపై అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ నెల 9న ఉదయం 7 గంటలకు ఏలూరులో సీఆర్ రెడ్డి పబ్లిక్ స్కూల్ నుంచి ఇన్‌డోర్ స్టేడియం వరకు యోగాంధ్ర కార్యక్రమంపై అవగాహన ర్యాలీ ఉంటుందన్నారు. ఈనెల 10న జంగారెడ్డిగూడెంలో మద్ది ఆంజనేయస్వామి గుడి వద్ద, 18న జీలకర్రగూడెంలోని గుంటుపల్లి గుహల వద్ద యోగాభ్యాసన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఈనెల 13న ఏలూరులోని సర్ సీఆర్ రెడ్డి డిగ్రీ కళాశాల గ్రౌండ్స్‌లో జిల్లా స్థాయిలో యోగాభ్యాసన కార్యక్రమం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మంత్రులు హాజరవుతారని, ప్రజలు పెద్దఎత్తున భాగస్వాములయ్యేలా అధికారులు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో ఏలూరు కమిషనర్ భానుప్రతాప్, ఇరిగేషన్ ఎస్ఈ నాగార్జున రావు, జిల్లా సహకార అధికారి ఎ.శ్రీనివాస్, డీఈఓ వెంకటలక్ష్మమ్మ, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ ఎం.ముక్కంటి, వెనుకబడిన తరగతుల సంక్షేమాధికారి ఆర్‌వీ నాగరాణి, డీఎస్ఓ శివరామమూర్తి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ త్రినాథ్‌బాబు, మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్ట్ పీడీ రవికుమార్, డీఎస్‌డీఓ శ్రీనివాసరావు పాల్గొన్నారు.


అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన

వేలేరుపాడు: మండలంలోని మేడేపల్లి రామవరం పంచాయతీల్లోని అల్లూరి నగర్, ఇప్పలగుంపు, మల్లారం, చెరువుగొల్లగూడెం, తెల్లపల్లి గ్రామాల్లో సుమారు రూ.కోటితో చేపట్టే తాగునీటి ట్యాంకులకు కూటమి నాయకులు అధికారుల సమక్షంలో శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జనసేన నేత గణేశుల ఆదినారాయణ, రామవరం సర్పంచ్ పిట్ట ప్రసాద్ మాట్లాడారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు, వివిద పార్టీ నాయకులు పాల్గొన్నారు.

రేపు ఉచిత మెగా వైద్య శిబిరం

కొయ్యలగూడెం: గవరవరంలోని వెంకటపతి రాజు విద్యాసంస్థల ప్రాంగణంలో 9వ తేదీ ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు, మాజీ సర్పంచ్ ఎస్ఆర్ఆర్ నరసింహారాజు తెలిపారు. ఏలూరు ఆశ్రం హాస్పటల్ వారిచే ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు వైద్య శిబిరం ఉంటుందన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

కార్నియాల సేకరణ


వీరమల్ల సూర్యారావు

టి.నరసాపురం: మండలంలోని బొరంపాలెం గ్రామానికి చెందిన వీరమల్ల సూర్యారావు శుక్రవారం సాయంత్రం మృతి చెందారు. ఆయన నేత్రాలను భార్య వీరమ్మ, కుమారులు సత్యనారాయణ, వెంకటేశ్వరరావు అంగీకారంతో ఎల్‌వీ ప్రసాద్ నేత్ర వైద్యశాల టెక్నీషియన్‌లు సుధారాణి, హరికృష్ణలు సేకరించారు. ఒకరు నేత్రదానం చేయడం ద్వారా 16 సంవత్సరాల్లోపు నలుగురు అందులకు చూపును ఇచ్చే అవకాశం ఉంటుందని వారు తెలిపారు.